# వానప్రస్థం

''ఒరేయ్ రాముా, ఆ ఉత్తరం నాకేనా?''

''కాదండీ. పార్వతమ్మగారికి.''

సావిత్రమ్మ కడుపు మండింది.

కాస్తోకూస్తో వంటచేసే నైపుణ్యం తప్ప పార్వతమ్మకు ఏమీలేదు. ఆమెచేత వంటలు చేయించుకొన్నవారు తప్ప నా అన్నవారు లేరు.

మరి తనకలాకాదే? అందం, ఐశ్వర్యం, విద్య, కొడుకులు, కూతుళ్లు, మనవలు, మనవరాళ్ళు, తన నుంచి సహాయాలు పొందినవాళ్ళు... ఓహ్! తన కెంత చరిత్రవుంది? అటు తండ్రి, యిటు మామగారు స్వాతంత్ర సమరయోధులు!

అయినా పార్వతమ్మకు పది రోజుల కో ఉత్తరం వస్తోంది.

ఆరునెలలయినా తనకి వొక్క ఉత్తరం రాసిన వాళ్ళు లేరు.

ఛీ.... ఛీ.... తల్చుకొంటే ఆమె గుండె దహించుకుపోయింది.

'ఒరేయ్ రాముా, ఆ ఉత్తరం దాని మొహానపడేసి నా దగ్గరకి రారా, నీతో కొన్ని ముఖ్యవిషయాలు చెప్పాలి.'

'అట్టాగేనమ్మా. కానీ అమ్మగారూ, మీరేమీ అనుకోనంటే వొక్క అభ్యర్థన. నిముషానికి అర్థరూపాయి గిట్టుబాటు కావడం లేదమ్మగారూ. రూపాయికి పెంచండి. అలాగయితే వెంటనే వస్తాను. లేకపోతే ఎప్పుడో తీరికున్నప్పుడు వస్తాను.'

'వద్దొద్దు. ఇప్పుడే రావాలి. వెధవ డబ్బు నాకోలెక్కనుకొన్నావా?''

డబ్బంటేనేకాదు, సావిత్రమ్మకు ఎవరన్నా లెక్కలేదు. ఎవరితోనూ యిమిడే తత్వంలేదు. ఆమెకు అనేకరకాల కాంప్లెక్సులు వున్నాయి.

భర్త బతికున్నంత కాలం, తను భర్తకన్నా అందగత్తెనన్న అతిశయం వుండేది. అందహీనుడైన అతను తనని ఆరాధిస్తూ అణిగిమణిగి పడివుండాలనుకొనేది. కానీ ఆమె భర్త గురుమూర్తికి తను పురుషుడినన్న గర్వం వుండేది. అంచేత అతను భార్య ఆటల్ని సాగనివ్వలేదు. తన చెప్పుచేతల్లో ఆమెను నడిపించాడు.

గురుమూర్తి మరణ సమయంలో ఆస్తంతా మెల్లగా తన పేర రాయించుకుంది సావిత్రమ్మ. అప్పటినుంచి తను ధనవంతురాలినన్న అతిశయం పెరిగిందామెలో. ధనవంతురాలైన తనకు అందరూ లోబడివుండాలనుకొంది.

సావిత్రమ్మకు యిద్దరు కూతుళ్ళు వొకకొడుకు. గురుమూర్తి బతికుండగానే యిద్దరు

కూతుళ్ళకు పెళ్ళిచేసేడు. అల్లుళ్లిద్దరు మంచి ఉద్యోగాలలో వున్నారు. ఆస్తి ఎరచూపి కూతుళ్ళనే కాక అల్లుళ్ళని కూడా తన అధికారం కిందికి తెచ్చుకోవాలని ప్రయత్నించింది సావిత్రమ్మ.

''అమ్మా! ఆడదానికి అంత అతిశయం అధికారకాంక్ష మేలుచేయవు. నాన్నను లొంగదీసుకోలేక బ్రతికి నంతకాలం ఆయన్ని సాధించావు. నువ్వు సుఖపడలేదు. ఆయన్ని శాంతంగా బ్రతకనివ్వలేదు. ఇప్పుడు నీ మూలంగా నాకూ నా భర్తకు మధ్య గొడవలొచ్చేలాగున్నాయి. నీ డబ్బుకు ఆశపడి నీకు లొంగి, ఆడంగిలా పడివుండటానికి నా భర్త అంత చాతకానివాడనుకొన్నావా? నా కాపురంలో నిప్పులు పోయకమ్మా- నీకు పుణ్యం వుంటుంది.''

ఇద్దరు కూతుళ్ళు అలా అన్నాక సావిత్రమ్మ తన సర్వశక్తుల్ని చిన్నవాడైన కొడుకుమీద కేంద్రీకరించింది. అప్పటికి ప్రభాకరంకు పదిహేడేళ్ళు. అయినా అతడిని తల్లిచాటు బిడ్డలా పెంచింది.

ప్రభాకరం, డిగ్రీపాసయ్యాక కూడా తల్లి ఎంతచెప్తే అంత. పొద్దున టిఫిన్ ఎంత తినాలన్న దగ్గరినుంచి రాత్రి ఎప్పుడు పడకోవాలన్న దానిదాకా తల్లి పర్మిషన్ లేకుండా చేసేవాడుకాడు.

'ప్రభా! నువ్వు నేను మల్చుకొన్న శిల్పానివి. తను మల్చుకొన్న శిల్పాన్ని ఎవరో వికృతంచేస్తే ఏ శిల్పికూడా భరించలేడు. నువ్వు ఎప్పటికీ యిలాగే వుండాలి. నా ఆస్తి అంతటికీ నువ్వొక్కడివే వారసుడవవుతావు. గుర్తుంచుకో' పీజీకి పంపిస్తూ సావిత్రమ్మ కొడుక్కు గుర్తుచేసింది.

పీజీ అయ్యాకేకాదు ఉద్యోగం వచ్చాక కూడా ప్రభాకరంలో మార్పులేదు. తల్లి అనుమతి తీసుకోనిదే ఏం చేసేవాడు కాదు.

తల్లి తనకి పెళ్లిచేస్తుందని చూచిచూచి విసిగిపోయి ఆఖరికి అడిగాడు.

'అమ్మా! నా క్లాస్‌మేట్ సత్యం లేడూ? వాడిపెళ్ళికి కూడా నేను వెళ్ళేనుకదా? వాడికి కొడుకు పుట్టేడమ్మా!'

తనకాలికింద భూమి కదిలిపోతున్నట్లు ఫీలయింది సావిత్రమ్మ.

పెళ్ళిచేస్తే కోడలు తన కొడుకును కొంగుకు ముడివేసుకొంటుందన్న భయంతో కావాలనే ఆమె అతడి పెళ్ళిప్రయత్నం చెయ్యలేదు.

''నీకు మనవడినో, మనవరాలినో యివ్వాలన్న కోరికగా వుందమ్మా నాకు. పెళ్లి చెయ్యవూ? నువ్వు చేసుకోమన్న పిల్లను చేసుకోంటానుగా!''

ఆమె అనేక సంబంధాలు చూచింది. ఆడపిల్లకు, ఆమె తల్లి తండ్రులకు కూడా అనేక పరీక్షలు పెట్టింది. ఆఖరికి ఆమె పరీక్షలో నెగ్గి, సుశీల ప్రభాకరం భార్య అయింది.

అయితే ఆమె కాపురానికొచ్చిన వేళావిశేషమేమిటో కాని ప్రభాకరంకు ప్రమోషన్లమీద ప్రమోషన్లు వచ్చాయి. నాలుగేళ్ళలో పెద్ద ఆఫీసరయ్యాడు. సుశీల మగపిల్లవాడిని కన్నది. యింతలో సావిత్రమ్మ ఆరోగ్యం క్షీణించింది.

అంతవరకు అత్తగారికి అణిగిమణిగి పడివున్న సుశీల అప్పుడు కొస్తకొస్తగా స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకోసాగింది. దాంతో అత్తా కోడళ్ళమధ్య స్పర్థ ఆరంభమయింది.

'అత్తగారూ....... మీకెన్నేళ్ళు?

'ఏం? నావయసుతో నీకిప్పుడేం పనొచ్చిందట'

'బహుశా అరవై దాటి వుంటాయి. నాకు ముప్పై సంవత్సరాలు. అనుభవించాల్సిన వయసంతా ఆరడితోనే గడచిపోతే ఎలా? మీరు అత్తగారి హోదా నుంచి రిటైర్ కావటం మంచిది.'

సావిత్రమ్మ కోడలి మీద అగ్గి బుగ్గయింది. కొడుకును నిలేసి పెద్ద అల్లరిచేసింది.

'ఒరేయ్ ముచ్చు వెధవా, పెళ్ళాన్ని అదుపులో పెట్టుకోటం చేతకాకపోతే ఎలారా? ఈ ఆస్తంతా నా పేరవుందని గుర్తుంచుకో. వాయించుదాన్ని.'

'దాని తప్పేముందమ్మా. పెద్దదానివయ్యావు. నువ్వేకాస్త సర్దుకుపోవటం నేర్చుకొంటే మంచిది. ఎప్పుడో నువ్విచ్చే ఆస్తికి ఆశపడి సుఖ శాంతుల్ని ఎవరు పోగొట్టుకొంటారిప్పుడు.'

'అయితే నాకు పిల్లలే పుట్టలేదనుకొంటా, పుట్టినా పురిటిలోనే చచ్చారనుకొంటా. సరేనా?'

'నేనేం చెప్పనమ్మా? అది నీ సంస్కారం మీద ఆధారపడి వుంటుంది. సుశీలతో నువ్వు సర్దుకోకపోతే నేను వేరే కాపురం పెట్టటం మాత్రం తథ్యం.'

అప్పుడామెకు వృద్ధాశ్రమాల గురించి తెల్సింది.

'మీరు లేకపోతే నేను బ్రతకలేననుకొన్నారా? డబ్బు పడేస్తే వృద్ధాశ్రమాలలో నన్ను మహారాణిలా చూచుకుంటారు. తెల్సా?' అంటూ ఆమె వచ్చి వృద్ధాశ్రమంలో చేరింది.

★——★——★

'పార్వతమ్మకు పది రోజుల కొకసారి ఉత్తరాలు ఎక్కడినుంచి వస్తాయో నీకు తెల్సునట్రా రామూ? నేను తెల్సుకున్నానులే. వయసులో వుండగా వంటలు చేస్తూ చాలా కథలు నడిపిందిటలే. ఆ పాత చుట్టరికాలు ఎక్కడికి పోతాయి? వాళ్ళంతా రాస్తుంటారు. మన దేశంలో యింకా సలీసుగా దొరికే వొకేవొక్క వస్తువు పోస్టల్ కార్డుకదా? ముప్పై అయిదు పైసలు పెడ్తే ఇన్‌లేండ్ కవరు వస్తుందాయె! హాయిగా ఎన్ని పురాణాలైనా రాసుకోవచ్చు. అయినా వృద్ధాశ్రమమని పేరుగాని యిక్కడి ముసలాళ్ళందరికీ చాలా పెద్ద పెద్ద పురాణాలే వున్నాయిరా' అంటూ సావిత్రమ్మ రాము దగ్గర ఆ పురాణాలన్నీ చెప్పసాగింది.

వృద్ధాశ్రమంలో చేరిన కొద్ది రోజుల్లోనే సావిత్రమ్మ తత్వం అందరికీ బోధపడింది.

ఆ ఆశ్రమంలో ఎనభైఅయిదు సంవత్సరాల వృద్ధుల నుంచి అరవై సంవత్సరాల వృద్ధుల వరకు వున్నారు. పెద్ద పెద్ద ఆఫీసర్ పదవుల నుంచి రిటైరయిన పురుషుల నుంచి బాల వితంతువులుగా చాలా కాలం గడిపిన స్త్రీలదాకా అనేక రకాల వారున్నారు. కొందరు దంపతులు కూడా వున్నారు.

ఎవరో పార్వతమ్మ లాంటి వొకరిద్దరు తప్ప అందరూ డబ్బున్నవారే. ఇంటిదగ్గర కొడుకులు, కూతుళ్ళు, మనవలు, మనవరాళ్ళు వున్నవాళ్ళే. అయిన వాళ్ళకి 'బరువు' అయి, వారిలో యిమడలేక ఆశ్రమంలో చేరేరు. ఒక్కొక్కరికి వొక్కొక్క సమస్య, అసమస్యలను మర్చిపోవటానికి మార్గం? పాటలు, పద్యాలు, భజనలు.....

అలా ఎవరి సమస్యలతో వారు, ఎవరి అన్వేషణలో వారువుంటే, సావిత్రమ్మ తన సమస్యను అందరినెత్తిన రుద్దాలని ప్రయత్నించింది. కొడుకు, కోడలు, కూతుళ్ళు, అల్లుళ్ళ మీద చాడీలు చెప్పింది. తన గొప్పతనాన్ని కీర్తించుకొంది.

పాపం ఆ ముసలాళ్ళు అమె సోదిని ఎంతకాలం భరించగలరు?

'సావిత్రమ్మా! అలాంటి కథలు యిక్కడ ఎవరికి లేవు చెప్పు? మన పిల్లలకి మనం బరువుకాకపోతే యిక్కడికి వచ్చే కర్మ ఎందుకు పడ్తుంది మనకు? అనవసరంగా వాటిని తల్చుకొని బాధపడి లాభం ఏమిటి చెప్పు. మర్చిపోయి, మనశ్శాంతితో బతకటానికి మార్గం ఆలోచించుకోవాలిగాని.'

అలా అన్నందుకు సావిత్రమ్మ ఆశ్రమంలో వాళ్ళని వొక్కొక్కరిని శత్రువుగా చేసుకొంది.

అప్పుడు ఆశ్రమంలో బాయ్ రాము ఆమె దృష్టిలో పడ్డాడు. వాడికి డబ్బిచ్చి తన గోడు చెప్పుకొని తృప్తిపడేది.

కానీ యిటీవల ఆ ఆశ్రమంలో వొక ముసలాయన మరణించిన దగ్గరనుంచి ఆమెకు భయం పట్టుకొంది.

ఆ ముసలాయనకు యింటి దగ్గర చాలా మందివున్నారు. అయితే చచ్చిన తర్వాత వొకరోజు దాటినా ఎవరూ రాలేదు. అంత్యక్రియలకు సరైన ఏర్పాట్లు చేయలేకపోయింది ఆశ్రమం. చచ్చిన వ్యక్తికోసం కన్నీటి బొట్టు వొక్కటి కార్చినవారు లేరు. చివరికి ఎలాగో ఆశ్రమంవారు అంత్య సంస్కారం జరిపించారు.

కానీ దిక్కులేనట్లు ఆచావేమిటి? ఆ అనాథ సంస్కారమేమిటి?

ఆశ్రమాలు అన్నం పెడ్తాయి. ఆశ్రయం యిస్తాయి. మందులిస్తాయి. సేవల్ని చేయవచ్చు. కానీ ఆత్మీయతను యివ్వగలవా?

ప్రభాకరం ఉత్తరం రాస్తే ఎంత బాగుండును?

'అమ్మగారూ! నలభై అయిదు నిముషాలయింది' సావిత్రమ్మ తన కడుపుబ్బరాన్నంతా తగ్గించుకొని ఆగేక రాము చేతి గడియారం చూస్తూ అన్నాడు.

'అయితే యిదిగో, యీ యాభై తీసుకో.'

'అయిదు రూపాయల చిల్లర లేదు అమ్మగారూ. దానికి బదులు మీకో మంచివార్తను చెప్తాను. మన ఆశ్రమానికి కొత్త ఇన్‌మేట్ వస్తున్నాడు.'

★——★——★

కొత్తగా ఆ ఆశ్రమానికి కొచ్చిన రామనాథం తొలి దర్శనంలో అందరినీ ఆకర్షించాడు. ఎర్రగా నిండుగా, నవ్వుతూ ప్రసన్న వదనంతో వున్న అయన రూపం సావిత్రమ్మను కూడా ఆకర్షించింది.

'ఈ వ్యక్తిని నే నెక్కడ చూచాను?' గింజుకోగా ఆమె కళ్ళముందు వొకదృశ్యం మెదిలింది.

'సావిత్రీ! అంత సిగ్గయితే ఎలా? వొక్కసారి తలెత్తి మా అబ్బాయిని చూచుకో. మీ యిద్దరు యిష్టపడితేనే యీ పెళ్లి జరుగుతుంది.'

సావిత్రి దొంగచూపుల్తో అతడి నెప్పుడో చూచింది. అతను చాలా అందంగా వున్నాడు. ఆమెకు నచ్చాడు.

మరి తను అతనికి నచ్చినట్లేనా?

అది తెల్సుకోటానికి ఆమె తలెత్తి అతనివైపు చూచింది. కానీ ఆమెకళ్ళు అతని కళ్ళను కలవలేదు. అతనెటో చూస్తున్నాడా సమయంలో.

''నువ్వింక లోపలకి పోమ్మా'' లోపలికి వెళ్ళినా సావిత్రి చెవులు అక్కడేవున్నాయి.

వాళ్ళకు సావిత్రి నచ్చింది. ఆ సంబంధానికి యిష్టాన్ని ప్రకటించారు.

'మిగతా విషయాలు మాట్లాడుకొంటే ముహూర్తాలు పెట్టుకోవచ్చు బావగారూ'' పెళ్ళికొడుకుతండ్రి సావిత్రి తండ్రితో అన్నాడు.

'మాట్లాడుకోటానికేముంది? మీకు తెల్సుకదా? నేను స్వాతంత్ర్యసమరయోధుడిని. నాకు కొన్ని ఆదర్శాలున్నాయి. నేను కట్న కానుకలు ఏమీ యివ్వను.'

'మిమ్మల్ని మేము కట్న కానుకలు అడిగేమా? మీతో సంబంధమే మాకు పదివేలు. మేము బీదవారిమైనా వొకరి డబ్బుకు ఆశించేవాళ్ళంకాదు.'

'కానీ నా దొక్క కండిషన్ వుంది. అబ్బాయి ఉద్యోగానికి రిజైన్‌చేసి స్వతంత్రంగా బ్రతకాలి. నె నెవరికి వ్యతిరేకంగా పోరాడుతున్నానో ఆ బ్రిటిష్ వారికి బానిస లాగా నా అల్లుడు పడివుండటం నేను భరించలేను.'

సావిత్రి తండ్రి పెట్టిన ఆ కండిషన్ విన్నాక అందరు ఆశ్చర్యపోయారు.

'నేనీ కండిషన్‌కు అంగీకరించను. ఎందుకంటే నా జీవితాన్ని నా యిష్టం వచ్చిన రీతిని మల్చుకొనే స్వేచ్ఛా స్వాతంత్రాలు నాకున్నాయి. ఆ విషయం గుర్తించలేని స్వాతంత్రయోధుడైన మామగారిని నేను భరించలేను.'

అదిగో - అతనే యీ రామనాథం.

అనాడు తన తండ్రి ఆ కండిషన్ పెట్టకపోతే తన భర్తగా యీ రామనాథం వుండేవాడు. యీ నాడు తనకీ వైధవ్యం.... వొంటరితనం వుండేదికాదు.

తనకి పెళ్లయ్యాక కూడా ఎన్నిసార్లు యితను గుర్తురాలేదు?

తన భర్త అందగాడు కాదన్న భావన కలిగినప్పుడల్లా గుర్తుకొచ్చేవాడు.

'నాన్నా! నువ్వు నీ ఆదర్శంతో నా కొంప కూల్చేవు. నా భర్త అందగాడని చెప్పుకొనే యోగ్యత లేకుండా చేసేవు. పోనీ నీ ఆదర్శమన్నా నిల్చిందా అంటే అదీ లేదు. కట్నానికి కట్నమూ యిచ్చావు. నా అందాన్ని కూడా గుర్తించి ఆరాధించలేని అనాకారిని నాకు కట్టపెట్టేవ్. నా భర్త సంపాదించే ధనం యీ లోటును పూడ్చగలదా?' తండ్రితోనే అందికూడా వొకసారి.

ఇన్నేళ్ళ తర్వాత అతనిక్కడ తారసపడడం చిత్రంకాదూ?

పాపం అతని భార్య చనిపోయి వుంటుంది. పిల్లలున్నారో లేరో?

ఆమె రాము ద్వారా తనని అతడికి పరిచయం చేయించుకొన్నది.

నాలుగు రోజులపాటు అతడిని జాగ్రత్తగా గమనించింది.

అతడెవరేం చెప్పినా వింటాడు. చిరు నవ్వులు తప్ప అతిగా మాట్లాడడు. ప్రత్యేక గదిలోకాక మరో నలుగురితో కల్సి ఉచితంగా యిచ్చే హాలులో వుంటున్నాడు. ఫేను సౌకర్యం కూడా లేకుండా ఎలా వుంటున్నాడో పాపం!

అతని మీద జాలితో పరిచయాన్ని పెంచుకొంది.

'నన్ను చూస్తుంటే మీ కేమి గుర్తురావటం లేదా?' అంటూ ఓ రోజు తనెవరయిందీ చెప్పింది.

'అలాగా? నేను గుర్తుపట్టలేకపోయాను సుమండీ. మీరు చెప్పేక యిప్పుడు గుర్తుకొస్తోంది.' నవ్వుతూ అన్నాడతను.

ఆమె తన కథంతా చెప్పుకొంది. బాధ చెప్పుకొంది. ఉక్రోషాన్ని వెళ్ళగక్కుకుంది. అతను వోపిగ్గా విన్నాడు. అప్పుడతని మొహం చూస్తుంటే ఆమెలో ఏవో ఆశలు కలిగాయి.

'మీ కథ చెప్పలేదు నాకు. కానీ చూడబోతే మీ కెవరూ లేనట్లుంది. డబ్బుకూడా పెద్దగా సంపాదించలేదా ఏమిటి? అయినా డబ్బు, నా అన్నవాళ్ళు వుండి నేను మాత్రం పొవుకున్నదేముంది లెండి?'

అతను నవ్వేడే కాని ఏం మాట్లాడలేదు. ఆమె కోరుకొనేది అలాంటి వ్యక్తినే.

'ఏమండీ. నేను బాగా ఆలోచించి వొక నిర్ణయానికొచ్చాను. మీరు ఏమీ అనుకోనంటే చెప్తాను.'

''చెప్పండి. అనుకోనేదేముంది?''

''ఆనాడు పెళ్లి అయినట్లయితే మనిద్దరం యివాళ కల్సిజీవించేవాళ్లం. అవునా?''

''ఊ!''

''యిప్పుడు మనిద్దరం ముసలి వాళ్లమయ్యాం. ఒొకరి కొకరి తోడు కావాల్సిన వయసు మనది. కానీ దురదృష్టవశాత్తు మీ కెవరూ లేరు. నాకు వుండీ లేనట్లేనని, చెప్పేను కదా? హోటళ్లలో వున్నట్లు యీ వృద్ధాశ్రమాలలో గడపటం నాకెందుకో బాగాలేదు. ఎంతైనా మనయిల్లు, మన యిల్లేకదా? పోనీయ్. నాకు డబ్బుకేమయినా లోటా అంటే అదీ లేదు. కావాలంటే మనిద్దరికీ యిష్టమయిన చోట హాయిగా యిల్లు కట్టుకోవచ్చు. కనుక......''

ఆమె ఆగి అతని మొహంలో భావాలని స్టడీచేసింది. నిశ్చలంగా, ప్రసన్నంగా వుందాతని వదనం. ''కనుక మనిద్దరం కల్సి ఎందుకు శేష జీవితాన్ని ఒొకరి కొకరు తోడుగ గడప కూడదు. ఐమీన్ - కేవలం ఫ్రెండ్స్‌లాగా. యీ వయసులో మనం లోకానికి భయపడాల్సిందేమిలేదు కదా?

రామనాధం తన ప్రపోజల్ విని ఎగిరి గంతేస్తాడనుకొంది సావిత్రమ్మ.

''మీకు నా అభిప్రాయాన్ని రేపు చెప్తాను. అంతవరకు క్షమించండి'' అంటూ రామనాధం కళ్ళు మూసుకొన్నాడు.''

రామనాథం తెల్లవారు ఝామునే లేచి వాకింగ్‌కు వెళ్లి వచ్చి స్నానం చేసి తెల్లవారేసరికి పూజాపునస్కారాలు ముగిస్తాడని ఆమెకు తెల్సు. అంచేత తను కూడా పెందరాడే లేచి తయారయింది.

తలుపు శబ్దమయింది. తీస్తే రామనాథమే!

అంటే రాత్రంతా ఆయనకీ నిద్ర లేదన్న మాట! ఎప్పుడెప్పుడు తన ప్రపోజల్‌ని అంగీకరించానని చెప్తామా అని ఆరాటపడ్తున్నాడన్న మాట!

''హోటళ్లలో వున్నట్లు వృద్ధాశ్రమాలలో ఒొంటరిగా గడపటం బాగా లేదన్నారు మీరు. ఆ మాట నాకు చాలా నచ్చింది. వృద్ధాప్య సమస్యకు వృద్ధాశ్రమ నిర్మాణాలు సమాధానం కాదని నాకూ అనిపిస్తోంది. అందుకేనేమో మనవాళ్ళు వృద్ధాశ్రమాలను నెల కొల్పకుండా ప్రతివారికి ఆశ్రమధర్మాలను నిర్దేశించింది.''

''ఆశ్రమధర్మాలా? అవేమిటి?''

''బ్రహ్మచర్య గార్హస్థ్య, వానప్రస్థ సన్యాసాశ్రమాలు. తెల్సో తెలియకో మొదటి రెండు ధర్మాలను ఏదో విధంగా అందరూ అనుసరిస్తున్నారు. కానీ మిగతా రెండు ఆశ్రమాలను పట్టించుకొనే వారే లేరు. కాషాయ గుడ్డలు కట్టి, ముక్కు మూసుకు కూర్చోటం, ముష్టెత్తుకోటం సన్యాసాశ్రమ లక్షణం కాదు. మనోవాక్కాయ కర్మల ద్వారా యింద్రియాలను జయించాలి. అరిషడ్వర్గాలైన

కామక్రోధ లోభమోహ మద మాత్సర్యాలను అదుపులో వుంచు కోవాలి. మహామహులకు సైతం సులభ సాధ్యం కాదిది. అందుచేతనే గృహస్థాశ్రమానికి, సన్యాసాశ్రమానికి మధ్య వాన ప్రస్థాశ్రమాన్ని పెట్టేరు పెద్దలు. యీ దశలో, తన వాళ్ళ మధ్య వుంటూనే కాస్త కాస్తగా భవ బంధవు సంకెళ్లను తెంచు కోవాలి. కోరికల్ని అరిషడ్వర్గాలని అదుపులో పెట్టే ప్రయత్నం చేయాలి. యీ స్ఫురణ లేకనే జీవితంలో నుంచి రిటైర్ కావల్సిన తరుణంలో వృద్ధులు తమ పిల్లలతో అధికారం కోసం పోటీ పడ్తున్నారు. సర్దుకు పోవాల్సిన తరుణంలో స్పర్థకు దిగుతున్నారు. వృద్ధాశ్రమాలకు వచ్చివొంటరితనంతో, ఆత్మీయత లభ్యంకాక బాధపడ్తున్నారు.

''అయితే యింతకీ మీరనేదేమిటి?''

''నేను చెప్పను. మీరు నిదానంగా ఆలోచించి తెల్సుకోండి. కానీ నేను వోడిపోయాను. నా కొడుకులు, కోడళ్లే గెలిచారు.''

''కొడుకులు, కోడళ్లు వున్నారా మీకు?''

''చాలా మంది వున్నారు. ఆ మధ్య పత్రికల్లో వృద్ధాశ్రమాలను గురించిన వ్యాసాన్ని చదివేను. వాటి ఆవశ్యకతను గురించి వాళ్లకు లెక్చర్ యిచ్చాను. తన వాళ్లతో సర్దుకు పోవటం వృద్ధుల సమస్యలకు పరిష్కారం కాని వృద్ధాశ్రమాలు కావని వారు వాదించారు. అనుభవంకోసం యిక్కడికొచ్చి చేరేను. ఆరు నెలల్లో నా వాదనలోని తప్పుల్ని గ్రహించాను. మన ప్రాచీనులకి దివ్య దృష్టి వుందని తెల్సుకొన్నాను. అంచేత వాన ప్రస్థాశ్రమ ధర్మనిర్వహణకు నా వాళ్ల మధ్యకు మళ్లీ వెళ్తున్నాను. మీ కోరికను కాదంటున్నందుకు మన్నించండి. బంధాల్ని తెంచుకోవాల్సిన తరుణంలో కొత్త బంధాలను తగిలించుకోలేను.''

హుందాగా నడిచి వెళ్తున్న అతడిని అలాగే చూస్తూ ఆలోచనలో పడింది సావిత్రమ్మ.

ఆంధ్రసచిత్ర వారపత్రిక - **26.2.1988**